క్లుప్తంగా

వంజారిగూడలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం లింగాపూర్ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ దత్తారాం మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ సునీల్, ఆశా వర్కర్ సూర్యకళ, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



ఇంటి వరండాలో చేరిన నీరు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురవడంతో లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు పొంగిపొర్లాయి. వాగు అవతల గ్రామాల ప్రజలు కెరమెరికి రాలేకపోయారు. అనేక చోట్ల పొలాల్లో నీరు నిలిచిపోయింది. మండల కేంద్రంలోని కొన్ని కాలనీల్లో డ్రెయినేజీలు నిండి ఇంటి వరండాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గేదె కళేబరం.. దుర్వాసనతో ఇబ్బందులు



రోడ్డు సమీపంలో కళేబరం

దహెగాం: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ సమీపంలో గేదె కళేబరం పడేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఎప్పటికప్పుడు కళేబరాలను తొలగించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న గేదె కళేబరాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పోచమ్మతల్లికి జలాభిషేకం

దహెగాం: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఇటీవల జ్వరాల బారిన పడ్డ వారు త్వరగా కోలుకోవాలని, వారిని సల్లంగ చూడాలని పోచమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించారు. మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో గత 20రోజుల క్రితం జ్వరాలు విజృంభించాయి. జ్వరాలు తగ్గినా కాళ్ల నొప్పులు మాత్రం తగ్గకపోవడంతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలోని చిన్నారులు మంగళవారం ఉదయం డప్పు వాయిద్యాలతో పెద్దవాగుకు వెళ్లి గంగాజలాన్ని తీసుకొచ్చి గ్రామ పొలిమేరలో ఉన్న పోచమ్మ తల్లికి జలాభిషేకం చేశారు.

దుప్పి మాంసం స్వాధీనం

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామానికి చెందిన దుర్గం నవీన్ ఇంట్లో దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. గ్రామ సమీపంలో దుప్పిని వేటాడారనే పక్కా సమాచారంతో సోదాలు జరపగా నవీన్ ఇంట్లో మాంసం లభ్యమైందన్నారు. పరీక్షల నిమిత్తం మాంసాన్ని ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనుమానితులను విచారించి దుప్పిని వేటాడిన వేటగాళ్లపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని అశోక్‌కాలనీ వద్ద మంగళవారం ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న గోగర్ల సాయిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. దాడిలో ఒక సెల్‌ఫోన్‌తో పాటు రూ.1250 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై దీకొండ రమేశ్ పాల్గొన్నారు.

‘రోడ్ల’పైనే అమ్మకాలు..!

- పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
- అపరిశుభ్ర వాతావరణంలో కూరగాయల విక్రయాలు
- పాత పీహెచ్‌సీ స్థలంలో మార్కెట్ ఏర్పాటుకు డిమాండ్

కౌటాల: కాళ్లకు వేసుకునే చెప్పులను అద్దాల బాక్సుల్లో అమర్చి విక్రయిస్తున్న రోజులివి. కానీ ప్రతీ రోజు.. ప్రతీ ఇంటికి అవసరమయ్యే కూరగాయలు మాత్రం ఇంకా రోడ్లు, గల్లీలు, డ్రెయినేజీల పక్కనే కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉంది. దుమ్ము, ధూళి, అపరిశుభ్రత మధ్య రోజూ రూ.వేలల్లో వ్యాపారం సాగుతోంది. మండల కేంద్రంలో ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. చికెన్, మటన్, చేపల విక్రయాలు రోడ్డు పక్కనే జరుగుతున్నాయి. అధికారులు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో మండల వాసులు అసౌకర్యాలు, అపరిశుభ్రత మధ్యే కొనుక్కోవాల్సి వస్తోంది. మరోవైపు ప్రధాన రహదారికి ఆనుకొని షెడ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారులు కౌటాల –కాగజ్‌నగర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విక్రయాలు చేస్తున్నారు. దీంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.



ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

దుమ్ము, ధూళి నడుమ..

కౌటాలలో ప్రత్యేకంగా మార్కెట్ లేకపోవడంతో రోడ్డు పక్కన నేలపైనే కూరగాయలు కుప్పలుగా పోసి వ్యాపారులు విక్రయిస్తున్నారు. స్థానిక కుమురం భీం చౌరస్తా, అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు, పోలీస్‌స్టేషన్ వెళ్లే రోడ్డు నుంచి మార్కెట్ ఏరియా రోడ్డుకు ఇరువైపులా, కౌటాల –కాగజ్‌నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపైనే అమ్మకాలు సాగుతున్నాయి. వాహనాల రాకపోకల నేపథ్యంలో కూరగాయలపై దుమ్ము, ధూళి పడుతోంది. అయినా గత్యంతరం లేక వినియోగదారులు వాటినే కొనుగోలు చేస్తున్నారు.

వార సంత.. చింత..

మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత నిర్వహిస్తున్నారు. సంతకు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), మహారాష్ట్ర నుంచి వ్యాపారులతో పాటు ప్రజలు వేలాదిగా వస్తుంటారు. సంత స్థలం కొంత ఆక్రమణకు గురి కావడంతో స్థలం సరిపోక.. వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వారసంత వేలం ద్వారా పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చినా కనీస సౌకర్యాలు లేవు. సంత స్థలంలో మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాత పీహెచ్‌సీ స్థలంలో..

కౌటాల పాత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలం ఆక్రమణకు గురవుతోందని ఇటీవల అదనపు కలెక్టర్ దీపక్ తివారి దృష్టికి పంచాయతీ అధికారులు తీసుకెళ్లారు. పాత పీహెచ్‌సీ స్థలాన్ని పరిశీలించిన ఆయన స్థలంలోని భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో పాటు ప్రభుత్వ స్థలం సైతం ఆక్రమణకు గురవుతున్నట్లు గుర్తించారు. స్థలంలోని భవనాలను కూల్చి వేసి కూరగాయలు, చేపలు, మటన్, చికెన్ విక్రయాల ప్రత్యేక మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని మండల పరిషత్ అధికారులకు సూచించారు. వైద్యశాఖ అధికారులతో మాట్లాడి పూర్తి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కౌటాల సెంటర్ పాయింట్‌లో ఉండే పాత పీహెచ్‌సీ స్థలాన్ని మార్కెట్ కేంద్రంగా ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు స్థలాలు కేటాయించాలని వారు కోరుతున్నారు.



పాత పీహెచ్‌సీ స్థలం ఎదుట అక్రమంగా వేసిన షెడ్లు

రోడ్డుపైనే విక్రయాలు..



కూరగాయల విక్రయాలకు మార్కెట్ లేకపోవడంతో చిరు వ్యాపారులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పాత పీహెచ్‌సీ స్థలంలో అక్రమంగా షెడ్లు వేస్తున్నారు. వాటిని తొలగించి మార్కెట్ ఏర్పాటు చేయాలి.

– దుర్గం లహంచు, యాపలగూడ

అక్రమ షెడ్లు తొలగిస్తాం



పాత పీహెచ్‌సీ స్థలం ఎదుట వేసిన అక్రమ షెడ్లను తొలగిస్తాం. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ స్థలాన్ని శుభ్రం చేసి ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేస్తాం. మార్కెట్ ఏర్పాటుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

– ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి

నేడు సామాజిక తనిఖీల ప్రజావేదిక

కాగజ్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆ వరణలో నిర్వహించనున్నట్లు ఏపీవో బుచ్చన్న తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి డీఆర్‌డీవో దత్తారా, డీవీవో కృష్ణమూర్తి హాజరవుతారని తెలిపారు.

భవానీమాత జాతరకు తరలివచ్చిన భక్తజనం



జాతరకు తరలివచ్చిన భక్తులు

వాంకిడి: ఏటా పొలాల అమావాస్య మరుసటి రోజు ‘బడుగ’ పండుగ పురస్కరించుకుని నిర్వహించే భవానీమాత జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. మండలంలోని సరాండి గ్రామ సమీపంలో నిర్వహించే ఈ జాతరకు సమీప గ్రామాల ప్రజలతో పాటు ఆసిఫా బాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు త రలివచ్చారు. గుట్టపై వెలిసిన భవానిమాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతర భక్తులతో రద్దీగా మారింది. ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

చట్టాలపై బాలికలకు అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీలో షీటీం, భరోసా టీం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై తిరుమల మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో జరుగుతున్న ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో బాలబాలికలకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం ద్వారా విధించే శిక్షలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, భరోసా కేంద్రం నంబర్ 8712670561, షీ టీం నంబర్ 8712670565ను సంప్రదించాలని సూచించారు. లీగల్ సపోర్ట్ అధికారిణి శైలజ, సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎస్‌వో శారద, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

‘దేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి’

కెరమెరి: ధర్మ సంస్థాపన కోసం దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంగెం వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న బూత్ స్థాయి నాయకులు ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. మండల కార్యదర్శి రంగు శ్రీకాంత్, బీజేవైఎం మండలాధ్యక్షుడు నవీన్ కుమార్, నాయకులు రాము, రామయ్య, క్రిష్ణ, అశోక్, అంబాజి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

బుద్ధవిహార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

వాంకిడి: మండల కేంద్రంలో బుద్ధవిహార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని భారతీయ బౌద్ధమహాసభ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో వేల సంఖ్యలో చదువుకున్న యువకులు గ్రంథాలయాలు అందుబాటులో లేక పోటీ పరీక్షల సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, అంబేద్కర్ భవనాల పేరుతో గ్రంథాలయ భవనాలు మంజూరు చేయాలని కోరారు. మండలంలోని ఖమాన, సరాండి, కనర్‌గాం, వాంకిడి కలాన్, వాంకిడి ఖుర్ద్ గ్రామాలకు గత నాలుగేళ్ల క్రితం భవనాలు మంజూరైనా నిధులు విడుదలకాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, బౌద్ధ సంఘం అధ్యక్షుడు విలాస్ ఖోబ్రగడే, నాయకులు విజయ్ ఉప్రే, శ్యాంరావు, సందీప్, ప్రతాప్, ప్రశాంత్, మహేశ్, గంగుబాయి తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

రాంచందర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రెబ్బెన: జిల్లా కేంద్రంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను సోమవారం మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్‌రావు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిని శాలువాతో సన్మానించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హత్యలు, భూకబ్జాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు గోగర్ల రాజేశ్, రొడ్డ శంకర్, అరికిల్లా స్వామి, గోగర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన లోబడె బాపురావు, మస్నే సంతోష్, మస్నే తుకారాం, ఆడె అనిల్, బామ్నే రాఘవ, బండె చంద్రశేఖర్ అనే వ్యక్తులు గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3200 స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జైనూర్: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంలొద్ది గ్రామ శివారులో జుబెర్, ఫయాజ్, రాజేశ్, హరినాథ్ అనే వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వాంకిడి: పేకాట రాయుళ్లతో పోలీసులు

ఘనంగా బడుగ వేడుకలు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం బడుగ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పొలాల అమావాస్య తర్వాత జరిపే ఈ పండుగలో భాగంగా బసవన్నలకు తినిపించిన నైవేద్యంతో గ్రామ శివారులో ఉన్న జమ్మిచెట్టుకు పూజలు జరిపారు. అనంతరం యువకులు, చిన్నారులు మర్మోళ్లను చెట్టు వద్ద పడేశారు. అనంతరం మర్రి చెట్టు, తెల్లమద్ది, తదితర చెట్లకు సంబంధించిన మొక్కలను సేకరించి ఇళ్లకు తీసుకెళ్లారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం బొడుగ వేడుకలు ఘ నంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక బొడ్రాయి, భూలక్ష్మి వద్ద సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన కొలుపు మంగళవారం ఉదయం ముగిసింది. భూలక్ష్మి వద్ద పట్నం వేసి రాత్రంతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని రైతులు, ప్రజలు మంగళవారం బడుగ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు స్థానిక గ్రామ దేవతల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్టితో ఎద్దులను తయారు చేసి స్థానిక చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. ప్రజలు గృహాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రైతులు ఎద్దుల మెడలకు గంటలు, వీపుపై రంగురంగుల జూలు, రంగులతో అలంకరించారు. అనంతరం మట్టి ఎద్దుల విగ్రహాలను ఊరేగించారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడ, బెల్గాంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం బడుగ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు మట్టితో తయారు చేసిన ఆవు, దూడ ప్రతిమలకు పూజలు చేసి నిమజ్జనం చేశారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామంలో మంగళవారం ఘనంగా బడుగ ఉత్సవాలు నిర్వహించారు. పొలాల అమావాస్య మరుసటి రోజు బడుగ పండుగను జరుపుకుంటారు. ఇష్టదేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, పిల్లలు నృత్యాలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. జాడి దీపక్, జాడి శివరాం, విలాస్, చరణ్‌దాస్, మారుతి, గణపతి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: పూజలో పాల్గొన్న భక్తులు



కెరమెరి: చెట్టుకు ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు



కౌటాల: వీర్దండిలో గ్రామ దేవతకు పూజలు చేస్తున్న రైతులు



ఆసిఫాబాద్‌రూరల్: బెల్గాంలో పూజలు చేస్తున్న మహిళలు



కాగజ్‌నగర్‌రూరల్: నృత్యం చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

‘సీట్లు అమ్ముకున్న వ్యక్తితో సంబంధం లేదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: మంత్రి సీతక్క పీఏ అని చెప్పుకుంటూ గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తికి మంత్రికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి సీతక్క పీఏ నంటూ సీట్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తి మంత్రి పీఏ కాదన్నారు. సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా చెబితే నమ్మవద్దన్నారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, సురేందర్ రావు, మాజీ సర్పంచ్‌లు రవీందర్, నాయకులు కిషన్‌గౌడ్, వెంకటేశం చారీ, గోలేటి పట్టణ అధ్యక్షుడు పల్లాస్ తదితరులు పాల్గొన్నారు.

కదిలే స్పీడ్ బ్రేకర్లు..!



వాంకిడి: మండలం మీదుగా వెళ్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారి -363పై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు రహదారి వెంట రోడ్లపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. నిత్యం పర్యవేక్షించాల్సిన పెట్రోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

చించోలి గ్రామంలో డ్రైడే



డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామపంచాయతీ పరిధిలో గల చించోలి గ్రామంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైడే ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెందుతాయని, తద్వార జ్వరాలు విజృంభిస్తాయని తెలిపారు. వర్షా కాలంలో తీసుకునే ఆహారంపట్ల జాగ్రత్తగా ఉండాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిదన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, ఏఎన్‌ఎం కాంత, ఆశ కమల పాల్గొన్నారు.